క్లుప్తంగా

పారిశుధ్యంపై విస్తృత ప్రచారం



అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ

నాగలాపురం: పారిశుధ్యంపై ఆదివారం ఎంపీడీఓ వెంకటరత్నమ్మ గ్రామ ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందుకోసం ప్రభుత్వం అందించిన డస్ట్‌బిన్లలో తడి, పొడి చెత్తను వేరువేరుగా సేకరించాలని తెలిపారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి రమేష్ ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వీధులను, మన చుట్టూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని అవగాహన కల్పించి డస్ట్‌బిన్లను పంపిణీ చేశారు.

రైతులకు డిజిటల్ కార్డు ఉంటేనే రాయితీలు



ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న ఏఓ

బుచ్చినాయుడుకండ్రిగ: రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్య ఉంటేనే ప్రభుత్వ పథకాలు, రాయితీలు వర్తిస్తాయని మండల వ్యవసాయాధికారిణి భారతి తెలిపారు. ఆదివారం ఆమె పల్లమాల గ్రామ సచివాలయంలో రైతులకు విశిష్ట గుర్తింపుపై సంఖ్యతో కూడిన డిజిటల్ గుర్తింపు కార్డుపై అవగాహన కల్పించారు. అనంతరం విశిష్ట గుర్తింపు సంఖ్య కోసం రైతుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు.

తడి, పొడి చెత్తపై అవగాహన



కుట్రమంగళంలో మాట్లాడుతున్న డీఆర్పీ

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంట మండలంలో ఆదివారం స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా డీఎల్పీఓ ప్రభురెడ్డి, డీఆర్పీ భరత్‌కుమార్ పర్యటించి ప్రజలకు తడి–పొడి చెత్తపై అవగాహన కల్పించారు. రేణిగుంట, గురవరాజుపల్లి, విప్పమ్మాను పట్టెడ, కుట్రమంగళం, వెంకటాపురం పంచాయతీలకు వెళ్లి పారిశుద్ధ్య కార్మికులు చేస్తున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈఓపీఆర్డీ ప్రభురావు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలు



మాట్లాడుతున్న సీఐ శ్రీనివాసులు

శ్రీసిటీ (వరదయ్యపాళెం): బాల్య వివాహాలతో అనేక కుటుంబాలు అనర్థాలకు లోనవుతాయని శ్రీసిటీ హైటెక్ పోలీస్‌స్టేషన్ సీఐ బీపీ శ్రీనివాసులు తెలిపారు. మహాశివరాత్రి సందర్భంగా గ్రామాల్లో బాల్య వివాహాలపై అవగాహన కల్పిస్తామని ఆయన ఆదివారం విలేకరులకు వివరించారు. ఆడబిడ్డలను చదువుకు దూరం చేసి బాల్య వివాహాలు చేయడం వల్ల వారి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందని తెలిపారు. పుస్తకాలు మోసే వయస్సులో పుస్తెల భారం పెట్టవద్దని సూచించారు. ప్రధానంగా తల్లిదండ్రులు ఆలోచన చేయాలని కోరారు. ఆడబిడ్డల మరణాలకు ప్రధానంగా బాల్య వివాహాలే కారణమని వివరించారు.

ఎండీయూ ఆపరేటర్ మృతి



సుబ్రమణ్యం (ఫైల్)

వరదయ్యపాళెం: మండలంలోని నాగనందాపురానికి చెందిన ఎండీయూ ఆపరేటర్ (రేషన్ బండి నిర్వాహకుడు) యానాటి సుబ్రమణ్యం (36) ఆదివారం తెల్లవారుజామున అనారోగ్యంతో మృతిచెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. సుబ్రమణ్యం చిన్న పాండూరు క్లస్టర్ పరిధిలోని యానాది వెట్టు, రాచర్ల గ్రామ పంచాయతీ ప్రజలకు రేషన్ బండి ద్వారా నెలసరి సరుకులు పంపిణీ చేసేవాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఆభరణాలకు అభద్రత

తమ వ్యక్తిగత అవసరాల కోసం ఆభరణాలను తాకట్టు పెట్టి రుణాలు పొందుతారు. అది కూడా ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థల్లో అధిక వడ్డీ భరించలేక ప్రభుత్వ రంగ సంస్థలకు చెందిన బ్యాంకులను ఎంచుకుంటారు. బ్యాంకుల్లో అయితే తాకట్టు పెట్టిన బంగారు ఆభరణాలకు భద్రతతో పాటు తక్కువ వడ్డీకి రుణాలు పొందవచ్చని ఖాతాదారుల నమ్మకం. ఈ నమ్మకం కాస్త ఇటీవల సన్నగిల్లుతోంది. ప్రధానంగా ప్రభుత్వం రంగానికి చెందిన బ్యాంకుల్లో పనిచేస్తున్న కొంతమంది అధికారులు చేతివాటాన్ని ప్రదర్శిస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారు. ఆ దిశగా ఇటీవల వరదయ్యపాళెం మండలంలోని ఎస్బీఐలో బ్యాంకు రుణాలు ఇచ్చే అధికారి ఏకంగా తాకట్టుకొచ్చిన బంగారు అభరణాలను బయటకు తరలించి ప్రైవేటు వడ్డీ వ్యాపార కేంద్రాల్లో తాకట్టు పెట్టి రుణాలు పొంది అక్రమాలకు పాల్పడ్డాడు. ఇది జరిగి ఆరు నెలలు కూడా పూర్తికాక మునుపే తాజాగా నాగలాపురంలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో మరో అభరణాల అక్రమాల పుట్ట బయటపడింది. దీంతో బ్యాంకులపై నమ్మకం సన్నగిల్లడానికి ఇటీవల జరుగుతున్న ఇలాంటి అక్రమాలే అని ఖాతాదారులు చెబుతున్నారు.

- బ్యాంకుల్లో బంగారు ఆభరణాలకు భద్రత కరువు
- యూనియన్ బ్యాంకులో ఐదున్నర కేజీల బంగారం గోల్‌మాల్
- అక్రమాలకు పాల్పడిన అసిస్టెంట్ మేనేజర్
- 10న వెలుగు చూసిన అక్రమ తంతు

వరదయ్యపాళెం: నాగలాపురంలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఖాతాదారులు తాకట్టు పెట్టిన బంగారు అభరణాలు భారీగా గోల్‌మాల్ అయ్యాయి. ఈ అక్రమ తంతు ఒక్కసారిగా బయటకు పొక్కడంతో ఖాతాదారుల్లో ఆందోళన మొదలైంది. ఈ మొత్తం వ్యవహారానికి ప్రధాన సూత్రదారి బ్యాంకులో అసిస్టెంట్ మేనేజర్‌గా విధులు నిర్వహించిన ఏ. సూర్యతేజ అని తేలింది. దీంతో ఈనెల 10న బ్యాంక్‌లో జరిగిన ఆడిట్‌లో బంగారు అభరణాలు మాయమైనట్లు అధికారులు నిర్ధారించారు. యూనియన్ బ్యాంకు ఉన్నతాధికారులు అక్రమాల చిట్టాను బయటకు తీశారు. దీంతో 67 మంది ఖాతాదారులు తాకట్టు పెట్టిన ఐదున్నర కేజీ బంగారు అభరణాలను అసిస్టెంట్ మేనేజర్ సూర్యతేజ కనుసన్నల్లో గోల్‌మాల్ అయినట్లు తేలింది.



నాగలాపురం యూనియన్ బ్యాంకు

రూ.12లక్షల విలువైన బంగారంపై రూ.1.35కోట్ల అక్రమ రుణాలు

ఇంటి దొంగను ఈశ్వరుడైనా కనుగొనలేడు అన్న చందాన నాగలాపురం యూనియన్ బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ సూర్యతేజ అక్రమాలు మూడు పువ్వులు, ఆరు కాయలుగా జరిగాయి. అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్న ఆయన ఇదే అదనుగా భావించి రూ.12లక్షలు విలువ చేసే 300 గ్రాముల బంగారు అభరణాలపై అదే యూనియన్ బ్యాంక్‌లో 11 మంది తన అనుచరుల పేరిట రూ.1.35 కోట్ల రుణాలు పొందాడు. అయితే ఆడిట్ జరిగిన సమయంలో లాకర్లు పరిశీలించగా 11 మంది పేరిట ఉండాల్సిన అభరణాలు లేకపోవడం గమనార్హం. ఏకంగా తన చేతివాటాన్ని ప్రదర్శించిన సూర్యతేజ బ్యాంకును బురిడి కొట్టించినట్లు ఆడిట్ అధికారుల విచారణలో నిర్ధారణ అయింది.



బ్యాంకులో ఖాతాదారులు

బయటకు తరలించిన 5 కేజీల బంగారం

ఖాతాదారుల ద్వారా బ్యాంకులో తాకట్టుకొచ్చిన ఐదు కేజీల బంగారాన్ని ఏకంగా ప్రైవేటు వడ్డీ సంస్థల్లో తాకట్టు పెట్టిన సూర్యతేజ కోట్లలో రుణాలు పొందినట్లు సమాచారం. బ్యాంకు నిర్ణయం మేరకు 67 మంది ఖాతాదారుల ద్వారా తాకట్టు పెట్టుకున్న ఐదున్నర కేజీల బంగారానికి రూ. 2.35కోట్ల మేరకు రుణాలు ఇవ్వడం జరిగింది. అయితే అసిస్టెంట్ మేనేజర్ సూర్యతేజ అదే బ్యాంకులో 300 గ్రాముల బంగారానికే రూ. 1.35కోట్ల అక్రమ రుణాలు పొంది చేతివాటాన్ని ప్రదర్శించాడు. మిగిలిన ఐదు కేజీల బంగారంపై మరో రూ.2కోట్లు పైగా రుణాలు పొంది ఉండొచ్చని అధికారుల అంచనా.

ఆందోళనలో ఖాతాదారులు..

నాగలాపురం యూనియన్ బ్యాంకులో దారి మళ్లిన బంగారు ఆభరణాల తంతు ఒక్కసారిగా బయటకు రావడంతో ఆభరణాలను తాకట్టు పెట్టిన ఖాతాదారుల్లో ఒక్కసారిగా ఆందోళన మొదలైంది. దీంతో తాము తాకట్టు పెట్టిన బంగారు ఆభరణాలు ఏమయ్యాయో అని 67 మంది ఖాతాదారులు ఆందోళన చెందుతున్నారు. అంతేకాక మిగిలిన వారిలోనూ ఆందోళన మొదలవడంతో ఒక్కసారిగా ఖాతాదారులు బ్యాంకు బాటపడుతున్నారు. తమ ఆభరణాలు చూపించాలంటూ అక్కడ ఉన్న బ్యాంకు సిబ్బంది ఎదుట వాపోతున్నారు. అయితే వారికి సమాధానం ఇవ్వాల్సిన మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్లు సస్పెండ్‌కు గురై విధుల నుంచి తప్పించడంతో సిబ్బందికి ఏం చేయాలో అర్థంకాని అయోమయ స్థితిలో ఉన్నారు.

అంతటా నిర్లక్ష్యం..

అయితే గత ఏడాది మే నెల నుంచి బంగారు అభరణాల గోల్‌మాల్ వ్యవహారాన్ని అసిస్టెంట్ మేనేజర్ సూర్యతేజ కొనసాగిస్తున్నాడు. పెద్ద మొత్తంలో 67 మందికి చెందిన ఐదున్నర కేజీల బంగారం బ్యాంకు నుంచి బయటకు తరలిస్తుంటే బ్యాంకు మేనేజర్ ఏం చేస్తున్నట్లని ప్రశ్నిస్తున్నారు. ఈ గోల్‌మాల్ వ్యవహారంలో మేనేజర్ పాత్ర కూడా ఉందా అనే అనుమానాలు ఒక్కసారిగా ఖాతాదారుల్లో వ్యక్తమవుతున్నాయి. 10నెలల పాటు ఈ అక్రమ తంతు చాప కింద నీరులా జరుగుతున్నప్పటికీ పర్యవేక్షించాల్సిన బ్యాంకు మేనేజర్ ఏం చేస్తున్నట్లు అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

విచారణ మొదలైంది



బంగారు అభరణాల గురించి బ్యాంకు ఉన్నతాధికారి ఫిర్యాదు మేరకు సూర్యతేజ, మేనేజర్ శేఖర్ తిరైవ రాజుపై కేసు నమోదు చేసినట్లు సత్యవేడు సీఐ మురళి తెలిపారు. పూర్తిస్థాయిలో ఇప్పటికే విచారణ మొదలు పెట్టాం. ప్రైవేటు సంస్థల్లో కుదువ పెట్టిన బంగారు అభరణాలను గుర్తించి స్వాధీనం చేసుకునేందుకు కసరత్తు మొదలు పెట్టాం. అన్ని కోణాల్లో బంగారు ఆభరణాల గోల్‌మాల్‌పై విచారణను వేగవంతం చేస్తున్నాం. – మురళి, సీఐ, సత్యవేడు

బొమ్మల పరిశ్రమను ఏర్పాటు చేస్తాం

రేణిగుంట: 'మేక్ ఇన్ ఇండియా' స్ఫూర్తితో ఎర్రచందనం ఉత్పత్తులు మన ప్రాంతంలోనే ఎక్కువగా ఉపయోగించుకోవాలని రెడ్‌శాండర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రవికుమార్, జాయింట్ సెక్రటరీ కొండేటి ఆంజనేయులు కోరారు. రేణిగుంట మండలం ఎర్రమరెడ్డిపాళెం సమీపంలోని అసోసియేషన్ కార్యాలయంలో యూనియన్ నేతలు సమావేశమయ్యారు. వారు మాట్లాడుతూ ఎర్రచందనాన్ని అధికారికంగా సాగుచేస్తున్న రైతులు వాటిని అమ్ముకునేందుకు ప్రభుత్వం నుంచి అనుమతులను సులభతరం చేశారన్నారు. తాము ప్రభుత్వ సహకారంతో త్వరలోనే ఎర్రచందనంతో బొమ్మలు, ఫర్నిచర్ ఉత్పత్తులను తయారు చేసి విక్రయిస్తామన్నారు. యూనియన్ కార్యదర్శి నాగయ్య, ఉపాధ్యక్షులు రామ్మోహన్, అనిల్‌చౌదరి, కోశాధికారి మల్లికార్జునరెడ్డి, సభ్యులు భాస్కర్, సాయిశ్రీనివాస్, సుబ్బరాయుడు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నేతలు

వివాహ వేడుకల్లో సీఎం చంద్రబాబు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్ కుమారుడి వివాహ వేడుకల్లో పాల్గొనేందుకు ప్రత్యేక హెలికాప్టర్లో ఆదివారం రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు ఎమ్మెల్యేలు, జిల్లా అధికారులు సాదర స్వాగతం పలికారు. విమానాశ్రయం వెలుపల ముఖ్యమంత్రి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం రేణిగుంట మండలంలోని తూకివాకం సమీపంలోని ఆర్వీఆర్ కల్యాణ మండపంలో జరిగిన వివాహ వేడుకలో పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం రోడ్డు మార్గాన విమానాశ్రయానికి చేరుకొని నెల్లూరుకు వెళ్లారు. డీఐజీ షిమోషి బాజ్పాయ్, జిల్లా కలెక్టర్ డా.వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, తిరుపతి మున్సిపల్ కమిషనర్ మౌర్య, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, టీటీడీ అదనపు ఈఓ వెంకయ్యచౌదరి, ఆర్డీఓ భానుప్రకాష్‌రెడ్డి, టీడీపీ ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.




వధూవరులను ఆశీర్వదిస్తున్న సీఎం చంద్రబాబు

అలరించిన నృత్య ప్రదర్శనలు



శ్రీసాయిదత్త శిష్య బృందం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ధూర్జటి కళాప్రాంగణంలో నిర్వహించిన పలు నృత్య ప్రదర్శనలు అలరించాయి. అందులో భాగంగా పట్టణానికి చెందిన శ్రీకాళహస్తి గురువు ఏ.సాయిదత్త బృందం భారతనాట్య ప్రదర్శన జరిగింది. చిన్నారులు కార్తికానంద్, నేత్రానంద్, కుందన సాయి, సాయి సాహితి, హేమశ్రీ, లోహితారెడ్డి, దీక్షిక రెడ్డి, ధాన్విత రెడ్డి, మోక్షిత, వర్షిని, నివాసిని, భూమిక, అన్విత బృందం ఘన ఘన గణపతి అనే పాటతో మొదలు పెట్టి, శ్రీకృష్ణ కోలాటం, డోలాయం అనే అంశంలో దశావతారాలు ప్రదర్శించి అలరించారు. ఎంతో చక్కగా చేసినటువంటి త్రినేత్ర నాట్యాలయం చిన్నారులను, గురువును ప్రశంసాపత్రం, జ్ఞాపికతో ఆలయ కమిటీ సభ్యులు సత్కరించారు. అదే విధంగా పట్టణానికి చెందిన హర్షిత భక్తి పాటలకు చేసి భరతనాట్యం అలరించింది. మండ్లసాయి గ్రీష్మితరెడ్డి నృత్య ప్రదర్శన అబ్బురపరిచింది.




విద్యుద్దీపాలంకరణలో శ్రీకాళహస్తి ఆలయం

శివరాత్రి శోభ

శ్రీకాళహస్తిలో మహాశివరాత్రి శోభ ఉట్టిపడుతోంది. అరటి పిలకలు, మామిడి తోరణాలు, విద్యుత్ దీపాలు భక్తులను మంత్రముగ్ధులను చేస్తున్నాయి. వాహన సేవల ముందు సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. కళాకారుల నృత్యప్రదర్శనలతో ధూర్జటి కళాప్రాంగణం మార్మోగుతోంది. – శ్రీకాళహస్తి











ఇది శతకోటీశ్వరుల బడ్జెట్

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): కేంద్ర బడ్జెట్‌పై రేణిగుంట సీపీఎం పార్టీ కార్యాలయంలో ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సీపీఎం పార్టీ ప్రాంతీయ కమిటీ కన్వీనర్ కొండ్రెడ్డి హరినాథ్ మాట్లాడుతూ కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ 50 లక్షల కోట్ల రూపాయల కేటాయింపులు అంతా దేశ ప్రయోజనాల కంటే శతకోటీశ్వరుల ప్రయోజనాల కోసం ప్రవేశపెట్టిన బడ్జెట్‌గా ఉందని విమర్శించారు. సీనియర్ నేత తులసిరాజన్, రేణిగుంట సీపీఎం కార్యదర్శి కె.ఈశ్వరమ్మ, చీరాలయ్య, ఏర్పేడు మండల నేతలు రంగయ్య, పద్మమ్మ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నేతలు

ఆమె సేవలు అభినందనీయం

వరదయ్యపాళెం: మండలంలోని రామిరెడ్డిపాళెం ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం దాసరాజు శాంతమ్మ విధి నిర్వహణలో ఆమె చేసిన సేవలు అభినందనీయమని ఎంఈఓ సరస్వతి కొనియాడారు. ఉద్యోగ విరమణ పొందిన ఆమెకు వరదయ్యపాళెంలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో ఆదివారం వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమెకు మండలంలోని ఉపాధ్యాయులు, స్థానిక ప్రజలు, పార్టీలకు అతీతంగా నాయకులు ఘనంగా సత్కరించారు. వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి చిన్నా, టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు నరసరాజు, రిటైర్డ్ ఎంపీడీఓ సుబ్రమణ్యం రాజు, హైస్కూల్ విద్యా కమిటీ చైర్మన్ పాల్గొన్నారు.



శాంతమ్మను సత్కరిస్తున్న టీచర్లు

బ్రహ్మోత్సవాలకు దాతల ఔదార్యం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా పలువురు దాతల తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. అందులో భాగంగా ఆదివారం నెల్లూరు జిల్లా పూడిపర్తి గ్రామానికి చెందిన సారంగం రామచంద్రయ్య, ప్రమీల దంపతులు రూ.లక్ష విలువ చేసే 55 ఇంచుల ఎల్‌ఈడీ టీవీలను అందజేశారు. అదే విధంగా చెన్నైకి చెందిన గజలక్ష్మి, బాలయ్య 6వేల వాటర్ బాటిళ్లను వితరణ చేశారు. వీటిని ఈఓ బాపిరెడ్డి స్వీకరించి దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. వారికి స్వామి అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. డీఎస్పీ నరసింహమూర్తి పాల్గొన్నారు.



వాటర్ బాటిళ్లను అందజేస్తున్న దాత



ఆలయానికి అందజేసిన ఎల్‌ఈడీ టీవీలు